నేడు పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం

డిచ్‌పల్లి, అక్టోబర్ 20 : మండలకేంద్రంలోని 7వ బెటాలియన్‌లో నేడు (శనివారం) పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని నిర్వహించనున్నట్లు ఆర్ఐ శ్యాంరావు, ఆర్ఎస్సై చంద్రశేఖర్ తెలిపారు. కమాండెంట్ రాంప్రకాశ్ ఆధ్వర్యంలో వివిధ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. వారు శుక్రవారం పోలీసు అమరవీరుల కుటుంబసభ్యుల ఇండ్లకు వెళ్లి బాగోగులు తెలుసుకున్నారు. బెటాలియన్‌లో నిర్వహించే అమరవీరుల సంస్మరణ దినోత్సవానికి హాజరుకావాలని ఆహ్వానం పలికారు.

నలుగురిపై దాడి : కేసు నమోదు

ధర్పల్లి, అక్టోబర్ 20 : మండలకేంద్రంలోని పాత బస్టాండ్ ప్రాంతంలో జరిగిన గొడవలో నలుగురిపై దాడి కేసు నమోదు చేసినట్లు ఎస్సై వంశీకృష్ణారెడ్డి తెలిపారు. శుక్రవారం మధ్యాహ్నం పూలు అమ్మే విషయంలో నలుగురు ముస్లిం యువకులు... రంజిత్ అనే యువకుడితోపాటు అతడి తల్లిపై దాడి చేశారు. రంజిత్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపడుతున్నామని ఎస్సై తెలిపారు.

సైనికులకు, అభ్యుదయ రైతులకు సన్మానం

సైనిక దంపతులను సన్మానిస్తున్న టీఎంఆర్ ఫౌండేషన్ ప్రతినిధులు

నిజామాబాద్ రూరల్, అక్టోబర్ 20 : నగర శివారులోని గూపన్‌పల్లి, గంగస్థాన్ ఫేస్-2 ప్రాంతంలో ఉన్న మహాలక్ష్మీ ఆలయ ప్రాంగణంలో తాటి రాములు -మణెమ్మ (టీఎంఆర్) ఫౌండేషన్ ఆధ్వర్యంలో సైనికులు, అభ్యుదయ రైతులకు శుక్రవారం సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా స్థానిక కార్పొరేటర్ శ్రీనివాస్‌రెడ్డి హాజరై మాట్లాడారు. దేశ రక్షణ కోసం శ్రమిస్తున్న సైనికులతో పాటు రైతులను ప్రోత్సహించాలన్న ఉద్దేశంతో వారిని సన్మానించడం అభినందనీయమన్నారు. సార్జెంజ్ వాయుసేన రమేశ్‌తోపాటు అభ్యుదయ రైతు గుండ్రపు రాజన్నను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ అధ్యక్షుడు తాటి వీరేశం, ఉపాధ్యక్షుడు అశోక్‌కుమార్, కార్యదర్శి సత్యనారాయణ, మహాలక్ష్మీ ఆలయ కమిటీ అధ్యక్షుడు మోహన్‌రెడ్డి, గ్రామపెద్దలు సంజీవ్‌రెడ్డి, మల్లారెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, అర్చకుడు రాకేశ్, ఆరోగ్యశాఖ అధికారులు చందర్, ప్రసాద్‌రావు పాల్గొన్నారు.

నేడు మోస్రాలో బతుకమ్మ పండుగ

మోస్రా (చందూర్), అక్టోబర్ 20 : మోస్రా మండలకేంద్రంలో నేడు (శనివారం) బతుకమ్మ పండుగ నిర్వహించనున్నట్లు ఎంపీపీ పిట్ల ఉమా శ్రీరాములు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామంలోని చెరువు వద్ద ఏర్పాట్లను ఎంపీడీవో భారతి భారతి, కార్యదర్శి ప్రేమ్ శుక్రవారం పరిశీలించారు.

బాన్సువాడలో సమావేశానికి తరలిన బీఆర్ఎస్ శ్రేణులు

రుద్రూర్/ మోస్రా (చందూర్), అక్టోబర్ 20 : బాన్సువాడలో స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం బీఆర్ఎస్ బూత్ స్థాయి పరిశీలకులతో సమావేశం నిర్వహించారు. సమావేశానికి రుద్రూర్, చందూర్, మోస్రా మండలాలు, గ్రామాల బూత్ స్థాయి పరిశీలకులు తరలివెళ్లారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ రుద్రూర్ మండల అధ్యక్షుడు పత్తి లక్ష్మణ్, జడ్పీటీసీ సభ్యుడు నారోజి గంగారాం, ఎంపీపీ అక్కపల్లి సుజాతా నాగేందర్, సీనియర్ నాయకులు పత్తి రాము, నాగేందర్, సంగయ్య, సంజీవ్‌రెడ్డి పాల్గొన్నారు.

అభివృద్ధి చేశా.. మళ్లీ ఆశీర్వదించండి

- నియోజకవర్గ ప్రజలకు బాజిరెడ్డి గోవర్ధన్ విజ్ఞప్తి
- పాల్దా, బోర్గాం (పీ) గ్రామాల్లోని ఆలయాల్లో పూజలు

మోపాల్‌లో కుటుంబీకులతో కలిసి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్

పాల్దాలో మహాలక్ష్మి అమ్మవారికి పట్టు వస్త్రాలను సమర్పిస్తున్న ఎమ్మెల్యే బాజిరెడ్డి

నిజామాబాద్ రూరల్/ మోపాల్ (ఖలీల్‌వాడి), అక్టోబర్ 20 : నిజామాబాద్ రూరల్ నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో పదేండ్లలో ప్రజలు ఆశించిన అభివృద్ధి చేశానని, ఈసారి అసెంబ్లీ ఎన్నికల్లో తనను మళ్లీ ఆశీర్వదించాలని బీఆర్ఎస్ రూరల్ ఎమ్మెల్యే అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ కోరారు. రూరల్ మండలంలోని పాల్దా గ్రామశివారులో వాగుపై వంతెన నిర్మాణం కోసం గతంలో ప్రభుత్వం రూ.20 లక్షలు మంజూరు చేసింది. వాగును మాజీ ఎమ్మెల్సీ, బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి వీజీగౌడ్, ధర్పల్లి జడ్పీటీసీ బాజిరెడ్డి జగన్, ఐడీసీఎంఎస్ చైర్మన్ సాంబారి మోహన్, నుడా చైర్మన్ ఈగ సంజీవ్‌రెడ్డితో కలిసి శుక్రవారం పరిశీలించారు. ఈ వంతెన నిర్మాణం పూర్తయితే పాల్దా, శాంతినగర్‌లతోపాటు మండలంలోని ముల్లంగి, బొంకన్‌పల్లి గ్రామాలకు రైతులు, ప్రజల రాకపోకలకు మార్గం సౌకర్యంగా మారనున్నదని ఎమ్మెల్యే తెలిపారు.

పాల్దా మహాలక్ష్మి అమ్మకు బోనం, పట్టువస్త్రాల సమర్పణ

ప్రతి ఏడాది దసరాకు రెండురోజుల ముందు మహాలక్ష్మీ ఆలయంలో వీడీసీ ఆధ్వర్యంలో బోనాల పండుగను నిర్వహిస్తారు. బోనాల పండుగలో ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ పాల్గొని అమ్మవారికి బోనాలు, పట్టువస్త్రాలను సమర్పించారు. బీఆర్ఎస్ మండలఅధ్యక్షుడు మధుకర్‌రావు, ఎంపీపీ అనూషాప్రేమ్‌దాస్, జడ్పీటీసీ బొల్లెంక సుమలతాగోపాల్‌రెడ్డి, వైస్ ఎంపీపీ అన్నం సాయిలు, కేసీఆర్ సేవాదళ్ రూరల్ సెగ్మెంట్ కన్వీనర్ కోర్వ దేవేందర్, సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు అశోక్, సర్పంచ్ సుప్రియానవీన్, సొసైటీ చైర్మన్ జితేందర్, ఎంపీటీసీ ఆమనీనరేశ్, వీడీసీ, ఆలయకమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మోపాల్ మండలం బోర్గాం (పీ)లో ఉన్న శ్రీవల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డిగోవర్ధన్.. కుటుంబీకులతో కలసి పూజలు చేశారు. అనంతరం గ్రామంలోని దుర్గాదేవి మండపం వద్ద పూజలు చేశారు. కార్యక్రమంలో ధర్పల్లి జడ్పీటీసీ సభ్యుడు బాజిరెడ్డి జగన్, నుడా చైర్మన్ ఈగ సంజీవ్‌రెడ్డి, మండల అధ్యక్షుడు శ్రీను, మధుకర్‌రావు పాల్గొన్నారు.

రైలు ప్రమాదంలో తండ్రి, కూతురు దుర్మరణం

- ట్రైన్ ఎక్కుతుండగా కూతురు.. కాపాడబోయి తండ్రి..
- నిజామాబాద్ రైల్వేస్టేషన్‌లో దారుణం

నిజామాబాద్ క్రైం, అక్టోబర్ 20 : బాసర అమ్మవారికి మొక్కు చెల్లించుకునేందుకు వెళ్తున్న ఓ కుటుంబంలో రైలు ప్రమాదం తీవ్ర విషాదాన్ని నింపింది. ఓ కుటుంబంలోని నలుగురికి ఒకే బోగీలో కాకుండా వేర్వేరుగా సీట్లు దొరకడమే శాపమైంది. బోగీలోకి ఎక్కుతుండగా రైలు కింద పడి చిన్న కూతురు, ఆమెను కాపాడబోయి తండ్రి దుర్మరణం చెందారు. ఈ విషాద ఘటన నిజామాబాద్ రైల్వేస్టేషన్‌లో చోటుచేసుకున్నది.

బాధిత కుటుంబం తెలిపినమేరకు వివరాలు ఇలా ఉన్నాయి. హైదరాబాద్‌కు చెందిన ఎం.రాంచందర్ (51), భార్య సునీత, పెద్ద కూతురు వనిత, చిన్న కూతురు జనని (14) కలిసి బాసర అమ్మవారి ఆలయానికి మొక్కు తీర్చుకునేందుకు గురువారం రాత్రి పర్బనీ ఎక్స్‌ప్రెస్‌లో బయల్దేరారు. ఆన్‌లైన్ ద్వారా నలుగురికి టికెట్ రిజర్వేషన్ చేసుకున్నారు. ఈ నలుగురికి సీట్లు ఒకే బోగీలో కాకుండా.. వేర్వేరుగా లభించాయి. ఇందులో సునీతకు రిజర్వేషన్ సీటు ఎస్-8 బోగీలో రాగా, ఆమె భర్త, కూతుళ్లకు ఎస్-6 బోగీలో సీట్లు లభించాయి. శుక్రవారం తెల్లవారుజామున 4.15 గంటల సమయంలో వారు ప్రయాణిస్తున్న ట్రైన్ నిజామాబాద్ స్టేషన్‌లోని ప్లాట్‌ఫామ్ నంబర్-2 పై నిలిచింది. అదే సమయంలో సునీత ఉన్న బోగీలోకి వెళ్లి కూర్చుందామని.. రాంచందర్, ఆయన కూతుళ్లు నిర్ణయించుకున్నారు. పెద్ద కూతురు వనిత బోగీలోకి ఎక్కిన అనంతరం, చిన్న కూతురు జనని బోగీలోకి ఎక్కుతున్న సమయంలో ట్రైన్ కదిలింది. దీంతో కాలు జారి ఆమె ట్రైన్ కింద పడిపోయింది. ఆమె వెనకాలే ఉన్న తండ్రి రాంచందర్ కూతురును కాపాడే క్రమంలో ఆయన సైతం రైలు కింద పడిపోయాడు. ట్రైన్ జననిపై నుంచి వెళ్లడంతో శరీరం రెండు భాగాలుగా తెగిపోయింది. తండ్రి రాంచందర్‌కు తీవ్రగాయాలు కాగా చికిత్సనిమిత్తం దవాఖానకు తరలిస్తుండగా మృతిచెందాడు.

దైవ దర్శనానికి వెళ్తుండగా..రైలు ప్రమాదంలో వారి కుటుంబంలో విషాదాన్ని నింపింది. సునీత ఫిర్యాదు మేరకు రైల్వే పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

నగరంలో నేడు సద్దుల బతుకమ్మ

నిజామాబాద్ కల్చరల్, అక్టోబర్ 20 : నగరంలో నేడు (శనివారం) సద్దుల బతుకమ్మ పండుగను నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా మహిళలు బతుకమ్మ ఆడేందుకు వీలుగా పలు ప్రధాన కూడళ్ల వద్ద అధికారులు ఏర్పాట్లు చేయించారు. నగరంలోని ఖిల్లా బొడ్డెమ్మ చెరువు, పూలాంగ్ వాగు, బోర్గాం(పీ) వాగు... తదితర ప్రాంతాల్లో నగరపాలక సంస్థ అధికారులు విద్యుద్దీపాలు, బారికేడ్లను ఏర్పాటు చేయించారు. అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ఈతగాళ్లను అందుబాటులో ఉంచారు.

మంత్రి వేములకు పరామర్శ

మంజులమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న జడ్పీటీసీ మలావత్ మాన్‌సింగ్, నాయకులు

సిరికొండ, అక్టోబర్ 20 : మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డిని వేల్పూర్‌లోని తన నివాసంలో సిరికొండ జడ్పీటీసీ సభ్యుడు మలావత్ మాన్‌సింగ్, మైనార్టీ సెల్ మండల అధ్యక్షుడు గౌస్ పాషా, రాజు, మహేందర్ శుక్రవారం పరామర్శించారు. మంజులమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

రైలులో గంజాయి అక్రమరవాణా

- వైజాగ్ టు మహారాష్ట్ర తరలింపు
- 25 కేజీల గంజాయి స్వాధీనం
- పరారీలో నిందితులు

నిజామాబాద్ క్రైం, అక్టోబర్ 20 : వైజాగ్ నుంచి మహారాష్ట్రకు రైలులో గంజాయిని అక్రమంగా తరలిస్తుండగా.. పోలీసులు తనిఖీలు చేపట్టారు. నిందితులు గంజాయిని వదిలేసి పారిపోగా.. గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. విశాఖపట్నం ఎక్స్‌ప్రెస్ - షిర్డీ రైలులో గురువారం రాత్రి ఆర్‌పీఎఫ్, జీఆర్‌పీ పోలీసులు జనరల్ చెకింగ్ నిర్వహించారు. ఎస్-5 కోచ్‌లో ప్రయాణికుల సీట్ల కింద అనుమానాస్పదంగా ఉన్న ప్యాకెట్లను పోలీసులు గుర్తించారు. మొత్తం 17 ప్యాకెట్లలో 25.650 కేజీల గంజాయిని పట్టుకున్నారు. గంజాయి రవాణా చేస్తున్న నిందితులు మాత్రం పోలీసులకు చిక్కకుండా పారిపోయారు. పట్టుబడిన గంజాయి విలువ రూ.6 లక్షల 25 వేలు ఉంటుందని పోలీసులు వెల్లడించారు. స్వాధీనం చేసుకున్న గంజాయిని నిజామాబాద్ ఎక్సైజ్ సీఐ దిలీప్‌కు అప్పగించారు. తనిఖీలు చేపట్టిన వారిలో రైల్వే ఎస్సై తానూనాయక్‌తో పాటు సిబ్బంది గురుదాస్, శ్రీకాంత్, సేనానాయక్, ఆర్‌పీఎఫ్ ఎస్సై ప్రవీణ్, సిబ్బంది ఉన్నారు.

గంజాయి ప్యాకెట్లను చూపుతున్న పోలీసులు

ఖిల్లా డిచ్‌పల్లిలో సద్దుల బతుకమ్మ

బతుకమ్మ సంబురాల్లో పాల్గొన్న మహిళలు

డిచ్‌పల్లి, అక్టోబర్ 20 : మండలంలోని ఖిల్లా డిచ్‌పల్లి రామాలయంలో సద్దుల బతుకమ్మను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. గ్రామ ఆడపడుచులందరూ వివిధ రకాల పూలతో బతుకమ్మలను పేర్చి, పూజలు చేశారు. గ్రామంలోని ప్రధానకూడళ్ల వద్ద ఆటపాటలతో సందడి చేశారు. అనంతరం స్థానిక చెరువులో నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ రాధాకృష్ణారెడ్డి, ఉపసర్పంచ్ ఆసది రవీందర్, రామాలయ చైర్మన్ పొద్దుటూరు మహేందర్‌రెడ్డి, గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.